29న నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

నర్సాపూర్, జనవరి 24: నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక కోసం నోటీసు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ఎన్నికల నిర్వాహణ ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ నెల 9న ఉదయం 11 గంటలకు సభ్యులందరూ హాజరు కావాలని సూచించారు. పార్టీలు విప్‌ను ఈ నెల 28 లోపు ప్రత్యేకాధికారికి అందచేయాల్సి ఉంటుందని తెలియజేశారు.

హరితహారం లక్ష్యం 27.87 లక్షల మొక్కలు

- మెదక్ జిల్లాలో 2024 సంవత్సరానికి ప్రణాళికలు సిద్ధం
- శాఖలవారీగా లక్ష్యాల కేటాయింపు
- అత్యధికంగా డీఆర్డీవో శాఖకు 18 లక్షలు
- అటవీశాఖ టార్గెట్ 7 లక్షలు
- నర్సరీల్లో మొక్కల పెంపకానికి చర్యలు

హరితహారం మొక్కల పెంపకానికి పక్కా ప్రణాళిక

గ్రామాల్లో ప్రజలు కోరుకునే మొక్కలనే నర్సరీల్లో పెంచటానికి ప్రాధాన్యమిస్తున్నాం. ప్రభుత్వ స్థలాలు, రోడ్డుకు ఇరువైపులా నాటే మొక్కలతో పాటుగా ఇంటి ఆవరణల్లో పెంచుకునేందుకు అనుకూలమైన పూల, పండ్ల మొక్కలను నర్సరీల్లో పెంచాలని సూచించాం. ఈమేరకు విత్తనాలు వేసుకోవడం ప్రారంభమైంది. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించాం.

-శ్రీనివాస్, మెదక్ డీఆర్డీవో

మెదక్ అర్బన్, జనవరి 24: హరితహారం లక్ష్యం ఖరారైంది. మెదక్ జిల్లాలో 2024లో 27.87 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. గ్రామీణాభివృద్ధి, అటవీశాఖ ఆధ్వర్యంలో అన్ని శాఖలు భాగస్వాములను చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. శాఖలవారీగా ఎంతమేర మొక్కలు నాటాలో నిర్దేశించారు. ఇందుకోసం అవసరమైన మొక్కలను జిల్లావ్యాప్తంగా 469 పంచాతీయల్లోని నర్సరీల్లో పెంచుతున్నారు. అయితే కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని పేరు మార్చి కొనసాగించే ఆలోచనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది.

అందుబాటులో 83 లక్షల మొక్కలు

మెదక్ జిల్లాలో ప్రస్తుతం 83 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలోని 469 పంచాయతీలు, 4 మున్సిపాలిటీల్లో ఉన్న నర్సరీల్లో ఈసారి 61.83 లక్షల మొక్కలను పెంచుతున్నారు. ఇందులో డీఆర్డీవో ఆధ్వర్యంలో ఈ ఏడాది పెంచిన 51.83 లక్షల మొక్కలు, అటవీశాఖ ఆధ్వర్యంలో పెంచిన 10 లక్షల మొక్కలు ఉన్నాయి. వీటికితోడు గతేడాదికి సంబంధించిన 21.58 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో నుంచి ఈసారి జిల్లాలో 27.87 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అత్యధికంగా జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో 18 లక్షలు, అటవీశాఖ ఆధ్వర్యంలో 7 లక్షల మొక్కలను నాటనున్నారు. మిగితా మొక్కలను ఆయా శాఖలకు అధికారులకు కేటాయించారు. ఎక్కడైనా మొక్కలు ఎండిపోతే తిరిగి నాటేందుకు పెద్దఎత్తున అందుబాటులో ఉంచారు.






హరితహారంలో నాటడానికి పాతూర్ గ్రామంలోని నర్సరీలో పెంచుతున్న మొక్కలు

స్థానికంగానే మొక్కల పెంపకం

హరితహారం కార్యక్రమంలో ప్రతీఒక్కరిని భాగస్వామ్యులను చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందులోభాగంగా డీఆర్డీవో ఆధ్వర్యంలో గ్రామాల్లోని ప్రతీ ఇంటికి ఆరు మొక్కలను పంపిణీ చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. ఇంటింటికి వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేయనున్నారు. నాటిన ప్రతీ మొక్కను బతికించేలా చర్యలు తీసుకోనున్నారు. పంపిణీ చేయడానికి అవసరమైన మొక్కలను ఎక్కడికక్కడ గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలోని నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నారు. ఇలా ప్రతీ నర్సరీలో పెంచాల్సిన మొక్కలపై ముందుగానే లక్ష్యం నిర్దేశించారు. కొన్నిచోట్ల నర్సరీల్లో మొక్కల పెంపకానికి ప్లాస్టిక్ కవర్లలో మట్టిని నింపుతుండగా కొన్నిచోట్ల విత్తనాలు వేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో మొక్కలు పెరుగుతున్నాయి. ఇందుకోసం ఒక్కో మొక్క పెంపకానికి ప్రభుత్వం రూ. 10 నుంచి రూ.12 వరకు ఖర్చు చేస్తున్నది.

శాఖలవారీగా నిర్దేశించిన లక్ష్యం

శాఖలు	లక్ష్యం
డీఆర్డీవో	18 లక్షలు
అటవీశాఖ	7 లక్షలు
హర్టికల్చర్	50 వేలు
మెదక్ మున్సిపాలిటీ	35 వేలు
తూప్రాన్ పురపాలక సంఘం	25 వేలు
నర్సాపూర్ బల్దియా	25 వేలు
రామాయంపేట మున్సిపాలిటీ	25 వేలు
ఆబ్కారీ శాఖ	30 వేలు
పరిశ్రమలశాఖ	20 వేలు
ఇరిగేషన్ శాఖ	20 వేలు
మైనింగ్ శాఖ	20 వేలు
పోలీస్ శాఖ	10 వేలు
మహిళాశిశు సంక్షేమశాఖ	10 వేలు
వ్యవసాయ శాఖ	10 వేలు
విద్యాశాఖ	5 వేలు
ఆరోగ్యశాఖ	2 వేలు



విద్యార్థినికి రక్త పరీక్ష చేయిస్తున్న మంత్రి దామోదర

'అనీమియా ముక్త్ తెలంగాణ' కోసం విద్యార్థులకు రక్త పరీక్షలు

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

పుల్‌కల్, జనవరి 24: విద్యార్థుల్లో రక్తహీనతను నివారించి 'అనీమియా ముక్త్ తెలంగాణ'గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం శివంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'అనీమియా ముక్త్ తెలంగాణ' కార్యక్రమాన్ని మంత్రి బుధవారం రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్, కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే దేశం సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని ఆయన ఆకాంక్షించారు. రక్తహీనత లేని ఆరోగ్య సమాజం ఏర్పాటయ్యేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులెవరూ రక్తహీనతతో బాధపడకూడదనే ఉద్దేశంతో రాష్ట్రస్థాయిలో అనీమియా ముక్త్ తెలంగాణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు ప్రతీరోజు 100 నుంచి 300 మంది విద్యార్థులకు పరీక్షలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. రక్తహీనతతో బాధపడే విద్యార్థులకు మందులు అందజేస్తామన్నారు. బాలబాలికలంతా ఆరోగ్యంగా ఉండడానికి వైద్య సిబ్బంది కృషి చేయాలని పేర్కొన్నారు. పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. మంత్రి దామోదర సమక్షంలో స్థానిక పాఠశాల విద్యార్థులకు రక్తహీనతను తెలుసుకునేందుకు హిమోగ్లోబిన్ శాతాన్ని పరీక్షించారు. హిమగ్లోబిన్ శాతం 10 నుంచి 12 శాతం వరకు ఉండాలని, కొంత మంది విద్యార్థులకు 9 శాతమే ఉందని వారికి ఐరన్ మాత్రలు అందజేయాలని వైద్య సిబ్బందిని మంత్రి ఆదేశించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణణ్ మాట్లాడుతూ అవగాహనతోనే రక్తహీనత సమస్యను నివారించవచ్చని అన్నారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ రక్తహీనతతో బాధపడే బాలికలకు భవిష్యత్తులో ఇబ్బందులు ఏర్పడుతాయని పేర్కొన్నారు. జిల్లాలో రక్తహీనత సమస్య నివారణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి గాయత్రీదేవీ, అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు, ఎంపీడీవో జయలక్ష్మి, తహసీల్దార్ ఈశ్వరీరాణి, సర్పంచ్ రాజిరెడ్డి, ఎంపీటీసీ కిరణ్ గౌడ్, పుల్కల్, చౌటకూర్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గారెడ్డి, నత్తి దశరత్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాములు, ఈశ్వర్‌గౌడ్, మల్లికార్జున్‌గౌడ్, రాజుముదిరాజ్, హెచ్‌ఎం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నివారించాలి

- మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



ప్రతిజ్ఞ చేయిస్తున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, జనవరి 24 : బాల్య వివాహాలను నిర్మూలించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్ష జాఢ్యాన్ని రూపుమాపాలంటే కుటుంబ వ్యవస్థలో మార్పు రావాలన్నారు. ఆడ, మగ అనే తేడా పిలుపులో తప్ప చూపే ప్రేమలో ఉండకూడదన్నారు. అమ్మాయిలు సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని, బాగా చదువుకొని రాణించాలని ఆకాంక్షించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. బేటీ బచావో-బేటీ పడావో క్యాలెండర్, గైడెన్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆడపిల్లల తల్లిదండ్రులను సన్మానించారు. రాష్ట్రస్థాయి బాక్సింగ్‌లో బంగారు పతకం సాధించిన శ్రీలతను అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్, అదనపు ఎస్పీ మహేందర్, డీఆర్వో పద్మశ్రీ, డీఈవో రాధాకిషన్, డీఎంహెచ్‌వో చందునాయక్, సంక్షేమాధికారి బ్రహ్మాజీ పాల్గొన్నారు.

ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత : జూనియర్ సివిల్ జడ్జి కల్పన

ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత అని స్పెషల్ మొబైల్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కల్పన అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మెదక్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్ విద్యార్థినులకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అందజేస్తున్న సేవలు, సంస్థ బాధ్యతలను వివరించారు.

ఎస్ఎన్‌సీయూ ల్యాబ్‌లో ట్రెయినీలతో పరీక్షలా?

- ఇంత అలసత్వమా?ఎల్‌టీపై చర్యలు తీసుకోండి
- వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాలు
- సంగారెడ్డి ఎంసీహెచ్‌లో ఆకస్మికంగా తనిఖీ
- పీడియాట్రిక్ సేవలపై అసంతృప్తి
- లోపాలు సరిచేసుకోవాలని అధికారులకు హెచ్చరిక

సంగారెడ్డి అర్బన్, జనవరి 24 : సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ ఆర్వీ కర్ణన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఎంసీహెచ్‌లోని లేబర్‌రూమ్, ఆపరేషన్ థియేటర్, నవజాత శిశు సంరక్షణ కేంద్రం (ఎస్ఎన్‌సీయూ), ఎన్ఆర్‌సీ, మదర్స్ వార్డు, ఓపీ తదితర విభాగాలను పరిశీలించారు. మాతా శిశువులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మదర్స్ వార్డులో బాలింతలతో మాట్లాడారు. వైద్య సేవలెలా అందుతున్నాయి? సమస్యలున్నాయా? మందులు ఇస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ఎంసీహెచ్ కిట్‌ను తెరిపించి సామగ్రి నాణ్యతను పరిశీలించారు.

అధికారులపై ఆగ్రహం

నవజాత శిశు సంరక్షణ కేంద్రం ల్యాబ్‌లో పరీక్షలను ట్రెయినీ విద్యార్థులు చేస్తుండడం గుర్తించిన కమిషనర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాబ్ టెక్నీషియన్ లేడా? ఉంటే స్టూడెంట్స్‌తో ఎందుకు పరీక్షలు చేయిస్తున్నారు? అని నిలదీశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ల్యాబ్ టెక్నీషియన్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పసికందులకు పచ్చకామేర్ల నిర్ధారణ పరీక్షలు చేసే పరికరం పనిచేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బాగు చేయించుకోవాలని తెలియదా అంటూ పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ షబ్బీర్‌ను ప్రశ్నించారు. ఇంత అలసత్వం, నిర్లక్ష్యంగా పనిచేస్తే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. గర్భిణీలు వైద్య సేవల కోసం భారీగా క్యూ లైన్‌లో వేచి ఉండడాన్ని గమనించిన కమిషనర్ కంప్యూటర్లు, సిబ్బందిని పెంచుకుని క్యూలో నిల్చునే తిప్పలు తప్పించాలని ఆదేశించారు. ఆస్పత్రిలో లిఫ్ట్ పనిచేయక పోవడంపై అసహనం వ్యక్తంచేశారు. అంతకుముందు ఆయన వెంట సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్, టీఎస్ఎంఎస్ఐడీసీ ఈఈ రవీందర్‌రెడ్డి, ఆర్ఎంవోలు డాక్టర్ వీరాంజనేయులు, డాక్టర్ పద్మావతి, విభాగాధిపతులు, డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎంసీహెచ్ సూపరింటెండెంట్ అనిల్‌కుమార్‌తో మాట్లాడుతున్న వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

ఇష్టంతో చదివి ఉన్నతంగా ఎదగాలి

- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, జనవరి 24 : ఇష్టంతో చదివి విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆకాంక్షించారు. సంగారెడ్డిలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం ప్రేరణ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థి భవిష్యత్తుకు పునాదిలాంటిదని చెప్పారు. 55 రోజులు ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. తాము ఐఏఎస్ కావాలనేది లక్ష్యమని, మార్గనిర్దేశం చేయాలని విద్యార్థులు కలెక్టర్‌ను కోరగా పట్టుదలతో సబ్జెక్టుల వారీగా చదివితే అనుకున్నది సాధించవచ్చని ఆమె తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ బుక్, పరీక్ష ప్యాడ్, జామెట్రీబాక్స్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి జగదీష్, పరిశ్రమల శాఖ జీఎం ప్రశాంత్, మోటివేషనల్ స్పీకర్ మల్లికార్జున్‌రావు, కూన వేణు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి

- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి
- ప్రభుత్వ ఆస్పత్రిలో తల్లులకు పండ్లు పంపిణీ

సంగారెడ్డి అర్బన్, జనవరి 24 : ప్రతీ బాలిక చదువుకొని అన్నిరంగాల్లో రాణించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. మహిళా శిశు సంక్షేమశాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో బాలింతలకు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో కలిసి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు బాలికలను చదివించి ఉన్నతస్థానంలోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన బాలికా దినోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి మాట్లాడుతూ ఆడపిల్లలు మగవారికి ఎందులోనూ తీసిపోరని, తల్లిదండ్రులు బాగా చదివిస్తే ఉన్నతస్థాయికి ఎదుగుతారని, అందుకు మన జిల్లా కలెక్టర్ ఉదాహరణ అని చెప్పారు. జిల్లా సంక్షేమాధికారి సంధ్యారాణి మాట్లాడుతూ ఆడపిల్లలు అన్నిరంగాల్లో రాణించేలా తల్లిదండ్రుల ప్రోత్సాహించాలని పేర్కొన్నారు. అంతకుముందు మెడికల్ కళాశాల ఆవరణలో బాలిక పేరిట మొక్కలు నాటి, ఆడపిల్లలు పుట్టిన తండ్రులను సన్మానించారు. అదేవిధంగా జాతీయ బాలికా దినోత్సవ వారోత్సవాల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ పల్లవి, డీసీపీవో రత్నం, జీజీహెచ్ సూపరింటెండెంట్ జి.అనీల్‌కుమార్, ఆర్ఎంవో వీరాంజనేయులు, డాక్టర్లు, సిబ్బంది, మెడికోలు పాల్గొన్నారు.



మెడికల్ కాలేజీ ఆవరణలో మొక్కను నాటుతున్న కలెక్టర్ క్రాంతి, కమిషనర్ ఆర్వీ కర్ణన్

ఘనపురం ఆయకట్టుకు సింగూరు జలాల విడుదల

- మంజీర జలాశయంలోకి 2,667 క్యూసెక్కుల నీరు

పుల్‌కల్, జనవరి 24 : మెదక్ జిల్లాలోని ఘనపురం ఆయకట్టు పరిరక్షణకు బుధవారం సింగూరు జలాలను విడుదల చేశారు. ఘనపురం ఆనకట్ట కుడి, ఎడమ కాలువల కింద ప్రస్తుతం యాసంగి సీజన్ వరి నాట్లు వేస్తుండటతో ఆయకట్టు పరిరక్షణకు సింగూరు జలాలను విడుదల చేయాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సింగూరు ప్రాజెక్టు నీటి పారుదల శాఖ అధికారులు బుధవారం ఉదయం నుంచి నీటి విడుదలను ప్రారంభించారు. ప్రాజెక్టుకు ఎడమవైపున నిర్మించిన జల విద్యుత్ కేంద్రంలోని 7.5 మెగావాట్ల సామర్థ్యం గల రెండు విద్యుత్ ఉత్పత్తి గేట్ల ద్వారా 2,667 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న మంజీర జలాశయంలోకి వదులుతున్నారు. మంజీర జలాశయానికి జలాలు చేరుకున్న అనంతరం ఆదివారం వరకు ఘనపురం ఆనకట్టకు విడుదల చేసే అవకాశాలున్నాయి. ఘనపురం ఆయకట్టు పరిరక్షణ కోసం ప్రస్తుతం యాసంగి సీజన్‌కు పూర్తయ్యేంత వరకు జలాలను విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు జేఈఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. మొదటి విడతగా 12న 0.35 టీఎంసీ జలాలను విడుదల చేశామని, తాజాగా 0.35 టీఎంసీ విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. వరి కోతకు వచ్చేంత వరకు విడతల వారీగా విడుదల చేస్తామని తెలియజేశారు. మంజీర నదీ పరీవాహక ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని జేఈఈ మహిపాల్‌రెడ్డి కోరారు.

పోలీసులు మెరుగైన సేవలందించాలి

- మెదక్ జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి

మెదక్ అర్బన్, జనవరి 24 : ప్రజలకు మెరుగైన పోలీసు సేవలందించాలని, ప్రణాళికబద్ధంగా పనిచేయాలని మెదక్ జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి సూచించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో నాణ్యతతో విచారణ చేపట్టాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణ, సీసీ కెమెరాల ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల సంఖ్యను పెంచాలన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాలో రద్దీ ప్రదేశాల్లో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేపడతామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు, సీఐ, ఎస్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి

సీఎంఆర్ బియ్యం ఇవ్వని రైస్‌మిల్లర్ ఆస్తి జప్తునకు నోటీసు

రెవెన్యూ రీకవరీ చట్టం ప్రయోగానికి చర్యలు

మెదక్, జనవరి 24 : కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్) గడువు ముగిసినప్పటికీ బియ్యం ఇవ్వని మిల్లర్ యజమానికి చెందిన ఆస్తుల జప్తునకు మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా బుధవారం నోటీసు జారీ చేశారు. నర్సాపూర్‌లోని శ్రీపాద ఇండ్రస్ట్రీస్, కాగజ్ మద్దూర్ శ్రీశివసాయి ఇండ్రస్ట్రీస్, పెద్దచింతకుంట శ్రీవేంకటేశ్వరా ఇండ్రస్టీస్ రైస్‌మిల్లుల యజమాని శ్రీధర్‌గుప్తాకు చెందిన రూ.47 కోట్ల విలువైన ఆస్తుల జప్తు చేయాలని ఆదేశించారు. తెలంగాణ రెవెన్యూ రీకవరీ చట్టం కింద కలెక్టర్ రాజర్షిషా ఈ నోటీసును జారీ చేశారు. గడువు ముగిసేలోగా 2021-22, 2022-23 సంవత్సరాలకు సంబంధించి సీఎంఆర్ బియ్యం పౌరసరఫరాల శాఖకు అప్పగించాలని ఎన్నిసార్లు హెచ్చరించినా బేఖాతర్ చేయడంతో రూ.47,17,36,860 కోట్ల ఆస్తులు జప్తు చేయాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

జూన్ తర్వాత బీఆర్ఎస్ ఖాళీ కావడం ఖాయం

- పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే పోటీ
- మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

నర్సాపూర్, జూన్ 24: వచ్చే జూన్ తర్వాత బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా ఖాళీ అవడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నేత, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి సమీపంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్ నేతృత్వంలో నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ ఉంటుందని బీఆర్ఎస్ పార్టీకి ఒక్క సీటు కూడా రాదని జోష్యం చెప్పారు. బీజేపీకి బలం కార్యకర్తలే అని, వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఆత్మవిశ్వాసంతో పనిచేయాలని కోరారు. మోదీ నాయకత్వంలో బీజేపీ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలవడంలో మర్మమేమిటో జనాలకు తెలుసన్నారు. నలుగురు ఎమ్మెల్యేలు సీఎంను కలిసిన విషయం జిల్లాకే చెందిన మాజీ మంత్రి హరీశ్‌రావుకు తెలవకుండానే జరిగిందా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, కౌన్సిలర్లు రాజేందర్, బుచ్చేస్‌యాదవ్, యాదగిరి, లతరమేష్‌యాదవ్, మాజీ ఎంపీపీ రమణారావు, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెద్ద రమేష్‌గౌడ్, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న రఘునందన్‌రావు





కోనేటికుంటలో కబ్జాల కూల్చివేత

పటాన్‌చెరు, జనవరి 24: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ గుట్ట దిగువన ఉన్న కోనేటికుంటలో బుధవారం రెవెన్యూ సిబ్బంది కబ్జాలను కూల్చివేశారు. కోనేటికుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో నాలుగు అక్రమ నిర్మాణాలను ఎక్స్‌వేటర్‌తో కూల్చివేయించారు. పక్కనే 993 అసైన్డ్‌భూమిలో నిర్మిస్తున్న కట్టడాలను తొలగింపజేశారు. అమీన్‌పూర్ ఆర్‌ఐలు రఘునాథ్‌రెడ్డి, రాజు నేతృత్వంలో కూల్చివేతలు కొనసాగాయి. ప్రభుత్వ భూములు, కుంటలు కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గౌరీవత్సల హెచ్చరించారు.



గ్రామ పంచాయతీల్లో జాతీయ జెండాను ఎవరు ఎగురవేయాలి?

● కలెక్టర్ ఉత్తర్వుల్లో లేని స్పష్టత

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 24 : గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. ప్రభుత్వ కార్యాలయ వద్ద ఏఅధికారులు ఎక్కడ జెండా ఎగురవేయాలో కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద మాత్రం ఎవరు జాతీయ పతాకాన్ని ఎగురవేయాలో ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ఆవరణంలో అదనపు కలెక్టర్ గరీమ అగ్రవాల్ జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. అనంతరం అధికారులంతా ఉదయం 9 గంటలకు నిర్వహించే సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరుకావాలని, సర్క్యులర్‌లో ఉంది. రెవెన్యూ డివిజన్ ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ డివిజన్ ఆఫీసర్, సబ్ డివిజనల్ ఆఫీసర్ జెండాను ఎగరవేయాలి. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోలు, ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దార్ జాతీయ జెండాను ఆవిష్కరించాలి. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించాలని ఉత్తర్వుల్లో ఉంది. కానీ ఎవరు జాతీయ పతాకాన్ని ఎగురవేయాలో తెలపలేదు. పంచాయతీల్లో సర్పంచ్‌లు, కార్యదర్శుల్లో ఎవరు ఆవిష్కరించాలో స్పష్టత ఇవ్వలేదు.

అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

● సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

జహీరాబాద్, జనవ 24 : గ్రామాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బూచనెల్లి గ్రామంలో రూ.51లక్షల వ్యయంతో సీఎస్సార్ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రజల అత్యవసరాలను గుర్తించి పనులను చేపడితే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భారతమ్మ, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్













'రెవెన్యూ' వద్ద ఆ భూమి రికార్డుల్లేవ్!

- హైదరాబాద్-శ్రీశైలం హైవే భూమి వివరాలివ్వాలని ఎన్‌హెచ్‌ఏఐకు వినతి
- 'రహదారికీ రైతుబంధు'పై విస్తృత చర్చ
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల ఆరా

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'రహదారికీ రైతుబంధు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మించిన భూమికి ప్రభుత్వం ఏళ్లుగా రైతుబంధు సొమ్ము ఇస్తూ వచ్చిన వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. అయితే రోడ్డు నిర్మించిన భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సరైన రికార్డులు లేనట్లు సమాచారం. దాంతో ఆ రికార్డులు అందజేయాలని రెవెన్యూ అధికారులు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులను కోరినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఈ సమస్య వెలుగుచూసింది. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. గత ప్రభుత్వ లోపాల వల్ల ఈ భూమికి రైతుబంధు సహాయం అందుతుండడమే కాక మరో సమస్య కూడా తలెత్తుతోంది. భూముల ధరలకు రెక్కలు వస్తుండడంతో చాలామంది రైతులు జాతీయ రహదారి ఉన్న భూమిని కూడా ధరణి రికార్డుల ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఇదే జరిగితే పెద్దఎత్తున వివాదాలు చోటుచేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల కడ్తాల- మైసిగండి మధ్య రోడ్డు నిర్మాణం జరిగిన 1.20 ఎకరాల భూమి.. ధరణి పాస్ పుస్తకంలో కూడా ఉండడంతో రూ.5 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది.


హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

కాగా, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను రికార్డులు అడగడంతో పాటు రోడ్డు ఉన్న సర్వే నంబరు భూములను పరిశీలించి సంబంధిత రైతుల రికార్డుల నుంచి ఆ భూమిని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటు ప్రభుత్వం ఈ విషయమై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆమనగల్లుకు చెందిన ఓ రైతు ఇటీవల స్థానిక తహసీల్దార్‌కు, కడ్తాల్‌కు చెందిన మరో రైతు ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

కేసీఆర్‌ను సీఎం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బాధాకరమేమీ కాదని, చాలా చిన్న దెబ్బ మాత్రమే తగిలిందని అన్నారు. "ప్రజలు మనల్ని ఛీకొట్టలేదు. 39 స్థానాల్లో గెలిచాం. మరో 14 స్వల్ప తేడాతో ఓడాం. ఆ 14 స్థానాల్లో ఇతర పార్టీలు గతంలో రెండు, మూడు, నాలుగుసార్లు వరుసగా పోటీచేసి.. ఒక్కసారైనా గెలిపించాలంటూ ఏడవడంతో ప్రజలు భావోద్వేగాలతో వారికి ఓటేశారు. ఇందులో ఆరేడు స్థానాలు బీఆర్ఎస్ గెలిస్తే ఎలా ఉండేది? 1.85 శాతం ఓట్ల తేడాతో మాత్రమే అధికారం కోల్పోయాం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పు ను అవమానపరిచే విధంగా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. "కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో గెలిచాం. మిగిలిన నాలుగింటిలో కూడా వారు సానుభూతితోనే గెలుపొందారు. అయినా మనకంటే వారికి కేవలం ఐదారు వేల ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. ఈ ఏడుపు, సానుభూతి ఎప్పటికీ ఉండదు" అని వ్యాఖ్యానించారు.

420 హామీలతో ప్రజలను నమ్మించారు..

ఎన్నికల్లో తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా.. మేనిఫెస్టోలో పేర్కొన్నవన్నీ కలిపి 420 హామీలు ఇచ్చారని, వాటిని ప్రజలకు వివరించి అమలయ్యే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుంటే రోడ్డుపై బట్టలూడదీసి ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాను పదునుగా వాడుకొని నరేంద్రమోదీ ప్రధానమంత్రి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రైతు భరోసా ఇచ్చామంటూ రేవంత్‌రెడ్డి దావో్‌స్‌లో పచ్చి అబద్ధం చెప్పారని, రైతుబంధు పేరు మార్చారే తప్ప.. డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొడతామంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా రాని70 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓట్లతో కొడతారో ఆలోచించుకోవాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి ఇస్తామన్న రూ.500 బోనస్ ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. మార్పు కావాలని ఓట్లు వేసిన 6.5 లక్షల ఆటో కార్మికుల కుటుంబాల కొంప కొల్లేరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వారికి ఏ అవకాశమచ్చినా కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎరువులు, విత్తనాల దుకాణాల వద్ద క్యూ కట్టాల్సి వస్తుందని ఎవరూ అనుకోలేదని, మళ్లీ ఆ రోజులు వచ్చాయని విమర్శించారు. బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్సుల కండిషన్ ఎలా ఉందో తెలుసుకోకుండా అనాలోచితంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో వారు కొట్టుకుంటున్నారని తెలిపారు. మరోవైపు డబ్బులు పెట్టుకొని వెళ్లే పురుషులకు సీట్లు దొరకడం లేదని, ఎవరూ సంతృప్తిగా లేరని అన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటి 57 లక్షల మంది మహిళలకు నెలకు 2,500 ఇవ్వకుంటే తాట తీయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తాము ఆ హామీ ఇవ్వలేదని భట్టివిక్రమార్క అన్నారని చెప్పారు.


బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ భేటీలో మాట్లాడుతున్న కేటీఆర్

మతం, దేవుళ్లతో బీజేపీ రాజకీయం..

బీజేపీ ఎంపీలు మతం, దేవుళ్లతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిత్యం మతం, ధర్మం అంటూ రెచ్చగొడుతూ కరీంనగర్‌లో గెలిచిన బండి సంజయ్‌కుమార్ అట్టర్ ఫ్లాప్ ఎంపీ అని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయానికి మోదీ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నలుగురు ఎంపీలను ఓడించింది బీఆర్ఎస్ కాదా? రెండు పార్టీలు ఒకటైతే కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేవారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, అదానీ ఒకటేనంటూ రేవంత్, రాహుల్ గాంధీ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆయనతోనే ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో మోదీ, అదానీ తరువాత.. రేవంత్ మూడో ఇంజన్‌గా మారారన్నారు. కేసీఆర్ సర్కారు పదేళ్లు అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, అమిత్‌షా, మోదీ సూచనతోనే అదానీతో రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర సంస్థలను అదానీకి కట్టబెడతారన్నారు. రేవంత్ మరో ఏక్‌నాథ్ షిండే అయినా ఆశ్చర్య పోవలసిన అవసరం లేదని, మైనారిటీలు ఆలోచించాలని సూచించారు.


మీడియాతో ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి

విపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలవకూడదా?

- రేవంత్ తెలంగాణ రాష్ట్రానికి సీఎం కాదా?
- సమస్యల పరిష్కారం కోసమే కలిశాం
- పార్టీని వీడేది లేదు.. ప్రతిపక్షంలోనే ఉంటాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీత, ప్రభాకర్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):"కాంగ్రెస్ పార్టీకే.. రేవంత్ ముఖ్యమంత్రా? తెలంగాణకు కాదా? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష నేతలు సీఎంను కలవకూడదా?" అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రావు ప్రశ్నించారు. తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఈ నలుగురు ఎమ్మెల్యేలూ సీఎం రేవంత్‌ను కలవడంతో వారు పార్టీ మారుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగానే కలిశామని, ప్రజాసమస్యలను చర్చించడంతోపాటు సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలపై కూడా మాట్లాడామన్నారు. ప్రతిపక్షంలో ఉంటే సీఎంను, మంత్రులను కలవకూడదా? ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను సీఎం రేవంత్ కలవడం లేదా అని ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి అంశాల్లో సహకరించాలని సీఎంను కోరామన్నారు. కాంగ్రెస్ లోకి వెళ్లాల్సిన అవసరం తమకు ఏముందని వారు ప్రశ్నించారు. సీఎంను మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం మంత్రులనూ కలుస్తూనే ఉంటామన్నారు. తమపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని.. ప్రతిపక్షంలోనే ఉండి పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్సే మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

రాహుల్ ప్రజల్లోకి వెళ్తుంటే బీజేపీకి ఎందుకంత భయం?

- గుడికి వెళ్లడానికీ అసోం సీఎం అనుమతి కావాలా?
- అప్పట్లో బతుకమ్మ పేరుతో కవిత మాదిరిగానే ఇప్పుడు రామాలయం పేరుతో మోదీ సినిమా చూపిస్తున్నారు..
- అయోధ్య గుడికి కారకుడైన అడ్వాణీని సన్మానించారా?: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళుతుంటే.. బీజేపీకి ఎందుకంత భయం? రాహుల్ గాంధీ గుడికి పోవద్దా? అందుకు అసోం సీఎం అనుమతి తీసుకోవాలా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. అసోం ప్రజలకు ఇబ్బంది లేకుండా రాహుల్‌గాంధీ పాదయాత్ర సాగుతోందని, అయితే ప్రధాని మోదీ దగ్గర మెప్పు కోసమే పాదయాత్రను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అడ్డుకున్నారని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని యాత్ర చేయకుండా అడ్డుకునే కుట్రను బీజేపీ చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. మోదీ పాలనలో న్యాయమైన పాలన జరగట్లేదని, ధరల పెరుగుదలకూ అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విమర్శించారు. దీనిపై ప్రజలను సంఘటితం చేసే పనిలో భాగంగా రాహుల్‌గాంధీ 'న్యాయ్ యాత్ర'ను చేపట్టారని, అసోంలో రాహుల్ యాత్రను బీజేపీ వాళ్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అసోం ప్రభుత్వం అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తోందని ఆరోపించారు. నిన్న మొన్నటిదాకా బతుమ్మ పండుగే లేనట్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పేరుతో సినిమా చూపించిందని, ఇప్పుడు ప్రధాని మోదీ.. రామాలయం పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ మధ్యనే కళ్లు తెరిచి.. రాములవారిని మొక్కాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. "రాములవారు పుట్టిన తర్వాత బీజేపీ పుట్టిందా? బీజేపీ పుట్టిన తర్వాత దేవుడు పుట్టాడా? ఆ పార్టీ పుట్టి కేవలం 40 ఏళ్లు అవుతుంది. సీతమ్మ, రాములవారు పుట్టి నాలుగు యుగాలవుతోంది. ప్రధాని మోదీ, ఇక్కడి బీజేపీ నేతలు సీతారాముల కల్యాణం చేస్తారో లేదో తెలియదు నేను. మాత్రం ప్రతియేటా చేస్తాను" అని వ్యాఖ్యానించారు. అయోధ్య గుడికి అసలు కారకుడు బీజేపీ సీనియర్ నేత అడ్వాణీ అని, ఆయన దేశమంతా తిరిగి అయోధ్యలో రామాలయం కట్టాలని ప్రచారం చేశారని చెప్పారు. అలాంటి అడ్వాణీని కనీసం సన్మానించారా? అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. సొంత పార్టీ నేత అడ్వానీ త్యాగమే గుర్తించని బీజేపీ.. కాంగ్రెస్ పార్టీ నేతల త్యాగం గుర్తిస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను ఎందుకు కలిశారో తనకు తెలియదు కానీ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదన్నారు. గత తొమ్మిదేళ్లలో దక్కని అవకాశాన్ని సీఎం రేవంత్ 2 నెలల్లోనే కల్పించారన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ఈసీ ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- అమోయ్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రీధర్‌లకు బాధ్యతలు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగులు ఇచ్చింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. వేటు పడిన అధికారులకు అప్రాధాన్య పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలాగే సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ సీఎండీగా పని చేసి, ఇటీవల బదిలీ అయి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.శ్రీధర్‌కు కూడా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఈసీ ఆదేశాలతో పోస్టింగ్‌లు కోల్పోయి, వెయిటింగ్‌లో ఉన్న డి.అమోయ్‌కుమార్‌ను పశు సంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీగా, టి.వినయ్‌కృష్ణారెడ్డిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా, ఎస్.హరీశ్‌ను రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.కాత్యాయనిదేవిని బదిలీ చేసి తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్ఐఆర్‌డీ) సీఈఓగా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న నాన్-కేడర్ అధికారి సుశీల్‌కుమార్‌ను గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

మే నెలలో ఎంసెట్.. నేడు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెలలో ఎంసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలకానుంది. ఎంసెట్‌తోపాటు రాష్ట్రంలో నిర్వహించే ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను కూడా ఇదే రోజున అధికారులు విడుదల చేయనున్నారు. ఈ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. ఎంసెట్‌తోపాటు లాసెట్, ఐసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ సెట్ల షెడ్యూల్‌ను ముందుగానే విడుదల చేస్తే అందుకనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుంది. అధికారులు కూడా ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సెట్లను నిర్వహించే కమిటీలు, కన్వీనర్లను కూడా ప్రకటించనున్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామక ఫైల్‌ను సత్వరం ఆమోదించండి

తమిళిసైతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరఫున నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. గవర్నర్‌తో 20 నిమిషాలపాటు ప్రత్యేకంగా సాగిన సమావేశంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లపై చర్చించినట్టు సమాచారం. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం.. రెండు రోజుల క్రితమే దానికి సంబంధించిన ఫైల్‌ను పంపింది. దానికి సత్వరం ఆమోదం తెలపాలని సీఎం, డిప్యూటీ సీఎం ఈ భేటీలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే సభ్యులకు సంబంధించిన జాబితాను కూడా పంపిస్తామని చెప్పినట్టు సమాచారం. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నందున ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు వారు గవర్నర్‌కు వివరించారు. తమిళిసై కూడా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్టు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే.. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, వారిని నామినేట్ చేయడానికి తమిళిసై నిరాకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటాలో నియమితులయ్యేవారు సాహిత్యం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సమాజ సేవ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలి. ఈ అర్హతలు లేవంటూ దాసోజు, కుర్ర పేర్లను గవర్నర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో.. రేవంత్ సర్కారు ఆ కోటా కింద ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్‌ను గవర్నర్‌కు పంపాలని భావించింది. అయితే ఈలోగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కోర్టుకు వెళ్లారు. తమ పేర్లను తిరస్కరించడం చట్టవిరుద్ధమని.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తమను నామినేట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును కోరారు. దీంతో.. ఈ విషయం కోర్టులో ఉన్నందున తాను నిర్ణయం తీసుకోలేనని రేవంత్ సర్కారుకు గవర్నర్ స్పష్టం చేశారు. తాజాగా బుధవారం ఈ కేసును అడ్మిట్ చేసుకున్న న్యాయస్థానం.. ఎమ్మెల్సీలుగా కొత్త ప్రభుత్వం ప్రతిపాదించినవారిని గవర్నర్ నామినేట్ చేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కాబట్టి ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లొచ్చనే అభిప్రాయంలో ఉన్న ప్రభుత్వం.. ఆ విషయాన్ని గవర్నర్‌కు తెలిపింది. తాము ఈ కోటాకు అర్హులైన వ్యక్తులనే సిఫారసు చేస్తామని రేవంత్, భట్టి బుధవారం భేటీలో తమిళిసైకి వివరించగా.. దీనిపై న్యాయసలహా తీసుకుంటానని ఆమె చెప్పినట్టు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో రేవంత్, భట్టి ఆ విషయాన్ని కూడా గవర్నర్ వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. కాగా.. గత కేసీఆర్ సర్కారు తీరుకు భిన్నంగా గణతంత్ర దినోత్సవాలకు గవర్నర్‌ను నేరుగా కలిసి ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన విషయాలను కూడా వివరించారు.


రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

మురుగునీటి సమస్యకు పరిష్కారం



నిలిచిపోయిన మురుగు నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

పటాన్‌చెరు, జనవరి 24: చందానగర్ మీదుగా బంధం కొమ్ము నుంచి అమీన్‌పూర్ మున్సిపాలిటీ వరకు రోడ్డు విస్తరణలో భాగంగా మురుగునీటి కాల్వ పునరుద్ధరణ చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. బుధవారం రోడ్డు విస్తరణ పనుల వద్ద నిలిచిపోయిన మురుగునీటిని అధికారులతో కలిసి పరిశీలించారు. కొంతకాలంగా బంధంకొమ్ము చెరువు నుంచి వచ్చే వరద కాలువ శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో మూసుకుపోవడంతో దుర్గంధం వస్తున్నది. అమీన్‌పూర్ నుంచి చందానగర్ వరకు రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో మురుగునీటి డైవర్షన్ కాలువను చందానగర్ ప్రధాన మురుగునీటి కాలువకు కలపాలని ఎమ్మెల్యే అరికెపూడిగాంధీని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి కోరారు. ఎమ్మెల్యే గాంధీ సానుకూలంగా స్పందించి, పనులకు అంచనాలు రూపొందించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణతపై దృష్టి సారించాలి

● జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి అర్బన్, జనవరి 24: పదవ తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో పదవ తరగతి పరీక్షలు, ఉత్తమ ఫలితాల సాధనపై ప్రధానోపాధ్యాయులు, విద్యాధికారులు, ప్రత్యేకాధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాలో ఒక్కో ప్రభుత్వ పాఠశాలకు ఒక్కో ప్రత్యేక అధికారిని నియమించామని, పదవ తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయడం, ప్రత్యేక తరగతుల నిర్వహణ తదితర విషయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తగిన చర్యలు చేపట్టాలని ప్రత్యేకాధికారులకు సూచించారు. 55 రోజుల్లో వారు ఏ విధంగా చదవాలన్న దానిపై సలహాలు, సూచనలు చేయాలని సూచించారు. సమావేశంలో డీఈవో వెంకటేశ్వర్లు, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీవో శ్రీనివాసరావు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ మణిదీప పాల్గొన్నారు.



పదో తరగతి పరీక్షలపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

పరిశోధన ఫలాలు సామాన్యులకు ఉపయోగపడాలి

సంగారెడ్డి అర్బన్: పరిశోధనా ఫలాలు సామాన్య ప్రజలకు ఉపయోగపడాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం, కంప్యూటర్ సైన్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో పరిశోధన విధానం-సవాళ్లు పరిష్కారాలు అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. మొదటి రోజు బుధవారం హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. పరిశోధన అనేది అందరికీ అందుబాటులో ఉండాలని, పర్యావరణ పరిరక్షణ కూడా పరిగణలోకి తీసుకుని పరిశోధనలు సాగించాలని సూచించారు. హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయ తెలుగు విభాగాధిపతి దార్ల వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, ఐఐటీహెచ్ అసిస్టెంట్ ప్రొ.మనీష్‌సింగ్, సదస్సు సంయుక్త సంచాలకులు జ్యోత్స్న, అధ్యాపకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగులు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

కలెక్టరేట్‌లో ముగ్గుల పోటీలు

సంగారెడ్డి రూరల్: నేడు జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ముగ్గులను కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించి మహిళా ఉద్యోగులను అభినందించారు. ప్రతిభను చాటిన ఉద్యోగులకు గురువారం బహుమతులను అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట డీఎస్‌వో వనజాత, స్వీప్ నోడల్ అధికారి అఖిలేష్‌రెడ్డి ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా: సునీతారెడ్డి



సికింద్లాపూర్ గ్రామంలో వాటర్‌ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హత్నూర, జనవరి 24: ప్రాధాన్య క్రమంలో గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం హత్నూర మండలం కొత్తగూడెం, లక్మాతండా, సికింద్లాపూర్ గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. సికింద్లాపూర్‌లో వాటర్‌ట్యాంక్‌ను, కొన్యాల గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అందరి సహకారంతో పార్టీలకతీతంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహులు, జడ్పీటీసీ ఆంజనేయులు, సర్పంచులు మాధవిరమేష్‌నాయక్, మాణిక్యరెడ్డి, దీపికారెడ్డి, సుధాకర్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు వెంకటయ్య, విఠల్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీకాంత్, బుచ్చిరెడ్డి, యాదగిరి, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో ఆరుగురు సైబర్ నేరగాళ్ల హాజరు

● దేశవ్యాప్తంగా 5,303 కేసుల్లో నిందితులు

సంగారెడ్డి క్రైం, జనవరి 24: దేశవ్యాప్తంగా 5,303 సైబర్ కేసుల్లో నిందితులుగా ఉన్న ఆరుగురిని సంగారెడ్డి జిల్లా కోర్టులో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీసులు ప్రవేశపెట్టారు. జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం... దేశ వ్యాప్తంగా 5,303 కేసులతో సంబంధం ఉన్న జార్ఖండ్ రాష్ట్రం గిరిదిహ్ జిల్లా అహల్యాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చమలిటికి చెందిన చోటి మండల్(22), మేఘన్ మండల్(24), సహదేవ్ మండల్(23), ప్రదీప్ మండల్(23), నిరంజన్ యాదవ్(20), అజయ్ మండల్(23)లు తెలంగాణ రాష్ట్రంలో 800 కేసులు, సంగారెడ్డి జిల్లాలో 24 కేసుల్లో నిందితులుగా ఉన్నారు. అమాయక ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని ఉద్యోగాలు, రుణాలు, ఆన్‌లైన్ గేమ్‌ల పేరిట సైబర్ మోసాలకు పాల్పడ్డారు. వారిని కోర్టులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపర్చినట్లు ఎస్పీ తెలిపారు.

ఆస్పత్రిని పరిశీలించిన కాయకల్ప బృందం

నాగల్‌గిద్ద: మండల పరిధిలోని కర్‌ఎగుత్తి 30 పడకల ఆస్పత్రిని బుధవారం హైదరాబాద్‌లోని అంబర్‌పేట్ ఏరియా ఆసుపత్రికి చెందిన కాయకల్ప బృందం సందర్శించింది. సూపరింటెండెంట్ అనురాధ నేతృత్వంలో గెనకాల జిస్టు సాయిలక్ష్మి, డాక్టర్ నాగశ్రీ, శ్రీనివాస్, నమ్రత, బృందం ఆస్పత్రి పరిశుభ్రత, ఇన్‌పేషెంట్‌తో పాటు రోగులకు అందుతున్న వైద్య సేవలు, చికిత్సల గురించి తెలుసుకున్నారు. వారి వెంట డాక్టర్ స్వప్న, సిబ్బంది గిరిధర్, సూపర్ వైజర్ గురుస్వామి ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

రాయికోడ్: రాయికోడ్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు, షాదిముబారక్ చెక్కులను ఎంపీపీ మమతాఅశోక్ పంపిణీ చేశారు.

మున్సిపల్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం కార్యదర్శిగా వెంకట్‌గోపాల్

నర్సాపూర్: మున్సిపల్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ రాష్ట్ర కమిటీలో కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జిన్నారం: బొల్లారం మున్సిపాలిటీలో నీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థల ఆధునీకరణతో పాటు సమస్యల పరిష్కారినికి కృషి చేస్తున్నట్లు చైర్‌పర్సన్ రోజారాణి తెలిపారు. బుధవారం 8వ వార్డులో చైర్‌పర్సన్ రోజారాణి, కమిషనర్ సంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, అధికారులు పర్యటించారు. కాలనీలో నీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలు నెలకొన్నాయని స్థానికులు తెలియజేశారు. వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందిని చైర్‌పర్సన్ ఆదేశించారు.

రక్తహీనతపై వైద్య పరీక్షలు

చిన్నశంకరంపేట: మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులకు బుధవారం ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. హినిమీయ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు హినిమీయ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి సాయిసింధు తెలిపారు.

ఖేడ్ ఏఐఎంఐఎం అధ్యక్షుడిగా మోహీద్‌పటేల్

నారాయణఖేడ్: ఖేడ్ నియోజకవర్గ ఏఐఎంఐఎం పార్టీ అధ్యక్షుడిగా నారాయణఖేడ్ పట్టణానికి చెందినమోహీద్‌పటేల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం కార్వాన్ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా ఇన్‌చార్జి కౌసర్‌మోహియోద్దిన్ సమక్షంలో మోహీద్‌పటేల్‌ను కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ సాజీద్‌ను ఎన్నుకున్నారు.

తూప్రాన్‌లో చోరీకి యత్నం

తూప్రాన్: తూప్రాన్ పట్టణంలో కిందివాడకట్టు రామ్‌నగర్ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి ఇద్దరు దొంగలు చోరీకి ప్రయత్నించారు. తీగల మధు ఇంట్లోకి ఇద్దరు చొరబడి చోరీ చేసేందుకు ప్రయత్నిస్తుండగా ఇంట్లోని వ్యక్తులకు మెలుకువ రావడంతో పారిపోయారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల ఫుటేజీల్లో నమోదయ్యాయి. పక్కనే ఉన్న విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయ తాళాలు పగుగొట్టి, చోరీకి యత్నించారు.

క్రీడాపోటీలు ప్రారంభం

చేగుంట: నార్సింగి మండల పరిధిలో సంకాపూర్ గ్రామంలో సర్పంచ్ సుజాతాశ్రీనివాస్ బుధవారం వాలీబాల్, క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ యువకులకు క్రీడా పోటీలను నిర్వహించామన్నారు. గెలుపొందిన జట్లకు గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు.

బీజేపీ ప్రధాన కార్యదర్శుల నియామకం

సంగారెడ్డి అర్బన్, జనవరి 24: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులుగా ముగ్గురిని నియమించినట్లు జిల్లా అధ్యక్షురాలు సి.గోదావరిఅంజిరెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. కరణం అనంతరావు కులకర్ణి(అందోలు నియోజకవర్గం), ఓడెల మాణిక్‌రావు(సంగారెడ్డి నియోజకవర్గం), కొల్కూరు రాజశేఖర్‌రెడ్డి(పటాన్‌చెరు నియోజకవర్గం)లను నియమించినట్లు పేర్కొన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ముగ్గురిని జిల్లా ప్రధాన కార్యదర్శులుగా నియమించినట్లు ఆమె తెలిపారు.

మెదక్ ఎంపీ టికెట్ గొల్లకురుమలకే ఇవ్వాలి

సంగారెడ్డి రూరల్, జనవరి 24: మెదక్ ఎంపీ టికెట్ గొల్ల కురుమలకే ఇవ్వాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బూరుగడ్డ నగేష్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని 4వ తరగతి ఉద్యోగుల సంఘం భవనంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 50 లక్షల జనాభా ఉన్న గొల్లకురుమలకు జనాభా దామాషా ప్రకారం పార్టీలు సీట్లు కేటాయించాలన్నారు. అన్ని పార్టీలు కూడా మెదక్ లోక్‌సభ టికెట్‌ను గొల్ల, కురుమలకు ఇవ్వాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకుని, బీఆర్‌ఎస్ పార్టీకి అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్న బీరయ్యాయాదవ్‌కు మెదక్ ఎంపీ టికెట్ ఇవ్వాలని సదాశివపేట మున్సిపల్ చైర్మన్ మల్లన్న కోరారు. తనకు మెదక్ పార్లమెంట్ టికెట్ ఇవ్వాలని బీఆర్‌ఎస్ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఉద్యమకారుడు బీరయ్య యాదవ్ తెలిపారు. సమావేశంలో కురుమ సంఘం నాయకులు పోచారం రాములు, అనంతయ్య, దశరథ్, మానయ్య, డాకూరి భూమయ్య, శంకర్‌యాదవ్, కృష్ణ, మల్లయ్య, రవి, నరేష్ పాల్గొన్నారు.

●**నాగల్‌గిద:** మెదక్ ఎంపీ టికెట్ బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారుడు బీరయ్యయాదవ్‌కు కేటాయించాలని నాగల్‌గిద్ద వైస్ ఎంపీపీ పండరియాదవ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మేత్రి పండరీ కోరారు.

పోతరాజుపల్లి ఆర్‌ఎంపీ అదృశ్యం



నరేష్ (ఫైల్)

తూప్రాన్, జనవరి 24: సంక్రాంతి పండుగకు ఆంధ్రలో నిర్వహించే కోడి పందాలు చూసేందుకు వెళ్లిన ఆర్‌ఎంపీ తిరిగి రాలేదు. తూప్రాన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లి గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ నర్సిగళ్ల నరేష్(28) తూప్రాన్ పట్టణ పరిధిలోని పోతరాజుపల్లి వద్ద కిషన్ దవాఖానాను నిర్వహిస్తున్నాడు. ఈ నెల 12న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్రాంతి పండుగకు జరిగే కోడిపందాలు, ఉత్సవాలు చూసేందుకు వెళ్లి తిరిగి రాలేదు. వెతికినా ఆచూకీ లభించడంలేదు. బుధవారం అయన భార్య స్వాతి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

కొత్తపల్లిలో మహిళ అదృశ్యం



సరిత

హవేళిఘణపూర్, జనవరి 24: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన మిగురి సరిత వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నది. వారం రోజుల క్రితం ఎవ్వరికి చెప్పకుండా ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు బుధవారం కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

కిష్టాపూర్‌లో ఒకరి అదృశ్యం



వెంకటయ్య

తూప్రాన్, జనవరి 24: తూప్రాన్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన పిట్ల వెంకటయ్య(52)కు కొడుకు సాయి కుమార్‌తో సోమవారం సాయంత్రం భూమి విషయంలో గొడవ జరిగింది. మంగళవారం తెల్లవారుజామున 4గంటలకు పొలం వద్దకు వెళ్తున్నట్లు వెంకటయ్య భార్యకు చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా కిష్టాపూర్ గ్రామ శివారులోని హల్దీ వాగు ఒడ్డున వెంకటయ్య బట్టలు, చెప్పులు కనిపించడంతో తూప్రాన్ పోలీసులు సిద్దిపేట నుంచి గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి చేయాలి

● నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



పెద్దశంకరంపేట సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట, జనవరి 24: మండలంలో ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు అధికారులు కృషి చేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సూచించారు. బుధవారం పెద్దశంకరంపేటలోని ఎంపీపీ సమావేశ మందిరంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారికి నోటీసులు పంపి, భూములను కాపాడాలని చెప్పారు. ఐదు సంవత్సరాల రికార్డులను తీసి అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ గ్రేస్‌బాయ్‌కు సూచించారు. ఇరిగేషన్ ఐబీకి చెందిన నాలుగు ఎకరాల స్థలాన్ని సర్వే చేయించి హద్దులు పాతాలని సూచించారు. గ్రామాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం సభ్యులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. మొదటిసారి సర్వసభ్య సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యేను ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీడీవో రఫీక్ ఉన్నీసా, తహసీల్దార్ గ్రేస్‌బాయ్, సర్పంచులు అలుగుల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయినిమధుసుదన్, సురేందర్‌రెడ్డి, దానంపల్లి నారాగౌడ్, పండరి, ఆయాగ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు సన్మానించారు.

దౌల్తాబాద్‌లో రామభక్తుల రాస్తారోకో

● హిందువులపై అక్రమ కేసులు పెట్టారని నిరసిస్తూ వ్యాపార సంస్థల బంద్



దౌల్తాబాద్‌లో రాస్తారోకో చేస్తున్న రామ భక్తులు

హత్నూర, జనవరి 24: రామభక్తులపై అక్రమ కేసులు పెట్టారని నిరసిస్తూ బుధవారం దౌల్తాబాద్‌లో రామభక్తులు భారీ ర్యాలీ నిర్వహించి, రాస్తారోకో చేపట్టారు. స్వచ్ఛందంగా వ్యాపార సంస్థలను బంద్ చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న రామభక్తులను బేషరతుగా విడుదల చేసేవరకు ఆందోళన విరమించేది లేదని బీష్మించు కూర్చున్నారు. చివరకు పోలీసుల అదుపులో ఉన్న ముగ్గురిని వదిలిపెట్టినట్లు తెలియడంతో ఆందోళన విరమించారు. మరోవైపు దౌల్తాబాద్‌లో కాషాయ జెండాలను తొలగించడంతో ఉద్రిక్తత నెలకొంది. హిందూ సంఘాల నాయకులు, కార్యకర్తలు పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. తొలగించిన జెండాలను తిరిగి కట్టేవరకు నిరసన కొనసాగిస్తామని భీష్మించుకు కూర్చున్నారు. అక్కడికి చేరుకున్న పోలీసులు గ్రామపంచాయతీ సిబ్బందితో జెండాలను తిరిగి యథావిధిగా ఏర్పాటు చేయించారు. రాస్తారోకోలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్, మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ హిందూ దేవుళ్లను అవమానించినా, హిందువులపై దాడులు చేసినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగసాని సురేష్, ఓబీసీ మోర్చా సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బిట్ల మహేష్, రాజేందర్, బీజేపీ హత్నూర మండల అధ్యక్షుడు నాగప్రభుగౌడ్, నాయకులు, వర్తక సంఘం నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

జిన్నారం: హత్నూర మండలం దౌల్తాబాద్‌లో శ్రీరాముని పల్లకీసేవ సందర్భంగా జరిగిన దాడి, పండ్ల దుకాణం దగ్ధం కేసులో ముగ్గురు బీజేపీ కార్యకర్తలను జిన్నారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. బీజేపీ కార్యకర్తలను విడుదల చేయాలని పోలీస్‌స్టేషన్ ఎదుట హత్నూర, జిన్నారం మండలాలకు చెందిన బీజేపీ కార్యకర్తలు ఆందోళన చేశారు. మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అక్కడికి చేరుకుని పోలీసులతో చర్చించి, కార్యకర్తలను విడిపించారు.

మత విద్వేషాలను రెచ్చగొడితే కఠిన చర్యలు: ఎస్పీ

సంగారెడ్డి క్రైం: మతవిద్వేషాలను రెచ్చగొట్టేవిధంగా ప్రవర్తించినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తప్పవని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ హెచ్చరించారు. వాట్సాప్ గ్రూపులో ఫేక్ మెసేజ్‌లు, వీడియోలు పోస్టు చేసినా, ఫార్వర్డ్ చేసినా గ్రూప్ అడ్మిన్‌పై చర్యలుంటాయని పేర్కొన్నారు. అల్లరి మూకల పని పట్టడానికి జిల్లా నిఘా వ్యవస్థ, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు అనుక్షణం పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు.

మోతీమాత జాతర ప్రారంభం

జహీరాబాద్, జనవ 24: మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌తండాలో బుధవారం మోతీమాత ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజనులు నృత్యాలు చేస్తు బోనాలతో ఆలయం వద్దకు వచ్చి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. మహిళలు సంప్రాదాయ దుస్తులు ధరించి నృత్యాలు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్, మండల అధికారులు, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



మోతీమాత ఆలయం వద్ద భక్తుల సందడి



నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● జాతీయ బాలికల దినోత్సవంలో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హన్మంతరావు

సంగారెడ్డి రూరల్, జనవరి 24: బాలికలు సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హన్మంతరావు విద్యార్థులకు సూచించారు. కంది మండలం కాశీపూర్‌లోని కేజీబీవీలో బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. బాలికలు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి సంధ్యారాణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రత్నం, పీవో లింగం, రామకృష్ణ, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ యాదగిరి, ప్రశాంతి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

● **పటాన్‌చెరు రూరల్:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో బుధవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బియాండ్ ద ఎక్రోనిమ్స్ పీసీవోడీ, పీసీవోఎస్ అనే అంశంపై జనరల్ ఫిజీషియన్ ప్రదీప్‌రెడ్డి ఎండీ (ఇంటర్నల్ మెడిసిన్) వెల్లడించారు.

● **కల్హేర్/సిర్గాపూర్:** సిర్గాపూర్ కేజీబీవీలో ప్రత్యేకాధికారిణి లలిత ఆధ్వర్యంలో విద్యార్థినులకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు.



ఆడపిల్లల ఆవశ్యకతను తెలిపేలా సిర్గాపూర్ కేజీబీవీలో విద్యార్థులు వేసిన ముగ్గు

● **చేగుంట:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల నోడల్ అధికారి నీరజ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు రాధా, సరస్వతి, శ్రీవాణి, రమ, లలిత, శారద, శృతి పాల్గొన్నారు.

వరిపంట రక్షణకు చర్యలు చేపట్టాలి

చిలప్‌చెడ్, జనవరి 24: వరి పంట రక్షణకు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి బాల్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల పరిధిలోని అంతారం గ్రామంలో వరిపంటను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి పంటలో కాండం తొలుచు పురుగును గమనించినట్లు తెలిపారు. దీని నివారణకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. కాండం తొలుచు పురుగు నివారణకు ఎకరానికి కార్టప్ హైడ్రో క్లోరైడ్ మందును ఎకరానికి 400 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఈవో రమ్య ఉన్నారు.

పంటపొలాల పరిశీలన

హవేళిఘణపూర్: మండలంలోని చౌట్లపల్లి, కొచ్చెర్వు తండా, హవేళిఘణపూర్, ముత్తాయికోట గ్రామాల్లో పంట పొలాలను మండల వ్యవసాయాధికారిణి నాగమాధురి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ.. వరిపంటలో కాండం తొలుచు పురుగు ఉధృతిఎక్కువగా ఉన్నదన్నారు. నివారణకు 0.3 ఎంఎల్ క్లోరాన్‌ట్రినిలిపోర్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. లేదంటే కార్బాపురాన్ 4జి గుళికలు ఎకరాకు 10 వేయాలని సూచించారు. ఆమె వెంట ఏఈవో ప్రశాంత్, రవీందర్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

అంతరాలు లేని విద్యనందించాలి

మెదక్ అర్బన్, జనవరి 24: అంతరాలు లేని సమాన విద్యనందించడం ప్రభుత్వాల బాధ్యత అని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సర్కార్‌బడుల్లో మౌలిక వసతులు కల్పిస్తే కార్పొరేట్ తరహా విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై ఫిబ్రవరి 4న జిల్లా కేంద్ర మహాసభలు, హక్కుల సాధనకు 11, 12 తేదీల్లో ఖమ్మంలో విద్య వైజ్ఞానిక మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంగయ్య, వెంకట్‌రాంరెడ్డి, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ యాదగిరి, శశిధర్‌రెడ్డి, గోపాల్, హీరాలాల్, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో మండల కమిటీ ఎన్నిక

చేగుంట, జనవరి 24: చేగుంట రైతువేదికలో చేగుంట యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బుధవారం టీఎన్జీవోల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చేగుంట అధ్యక్షుడిగా అశోక్‌రెడ్డి, కార్యదర్శిగా విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీఎన్జీవో సభ్యులు చంద్రశేఖర్, మహమ్మద్ ఖలీమ్, భూమేష్, మాధవి, శోభ, దివ్య, భువన, రాణి, ప్రవీణ్, మహమ్మద్ కలీం, రంగవ్వ, కిరణ్మయి, విజయపాల్, రజిత, దేవమ్మ, నాగభూషణం, లతీఫ్ పాషా, రామకృష్ణ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

తూప్రాన్, జనవరి 24: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన తూప్రాన్ పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లి రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. కామారెడ్డి రైల్వే ఎస్‌ఐ తావునాయక్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన షేక్ ఇమ్రాన్(25) కొన్ని నెలలుగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. మంగళవారం రాత్రి ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఇమ్రాన్ కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం బ్రాహ్మణపల్లి రైల్వే లెవల్ క్రాసింగ్‌కు సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. అనారోగ్య కారణంగానే ఇమ్రాన్ ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ తావునాయక్ వివరించారు. మృతుడికి భార్య నసిమా, ఏడాది కుమారుడు ఉన్నాడు.

లారీ ఢీకొని యువకుడి మృతి

మేడ్చల్ టౌన్, జనవరి 24: లారీ ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన శ్రీనాథ్(34) బుధవారం స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై మేడ్చల్ పట్టణంలోని ముకుంద్ థియేటర్ వద్ద జాతీయ రహదారి పైనుంచి తూప్రాన్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో ద్విచక్రవాహనంపై వెనకాల వెనుక కూర్చున్న శ్రీనాథ్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి గుండెపోటుతో మృతి

సంగారెడ్డి క్రైం, జనవరి 24: సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో భిక్షాటన చేస్తూ బతికే గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతి చెందినట్లు రూరల్ ఎస్‌ఐ రాజేష్ నాయక్ తెలిపారు. పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద పడి ఉన్న ఆ వ్యక్తిని గమనించి, ఆస్పత్రికి తరలించగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని చెప్పారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

అంబేడ్కర్‌ను అవమానిస్తే సహించం



అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన వారి దిష్టిబొమ్మను సంగారెడ్డిలో దహనం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

సంగారెడ్డి రూరల్, జనవరి 24: భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానిస్తే సహించేది లేదని కుల వివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం హెచ్చరించారు. కర్ణాటక రాష్ట్రంలో గుల్బర్గాలో అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలో బుధవారం దుండగుల దిష్టిబొమ్మను దహనం చేశారు. అంబేడ్కర్ విగ్రహాలపై దాడులు చేసినంత మాత్రాన ఆయన ఆశయాలను అడ్డుకోలేరని మాణిక్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, నాయకులు యాదగిరి, నర్సింహులు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

టేక్మాల్, జనవరి 24: మండల కేంద్రంలోని ఆగ్రోస్ ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను టేక్మాల్ తహసీల్దార్ కృష్ణ, ఏవో రాంప్రసాద్‌తో కలిసి బుధవారం తనిఖీ చేశారు. దుకాణాల్లో నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్టోరేజ్ ఎగ్రిమెంట్‌లు, జీఎస్టీ వివరాలు, బిల్లు బుక్‌ల వివరాలను దుకాణ యజమానులు సరిగా నిర్వహించాలని సూచించారు. ఎప్పటికప్పుడు నిల్వల రికార్డులను పరిశీలించుకోవాలని సూచించారు. గుర్తింపు పొందిన ఎరువుల కంపెనీల నుంచే మందులను, ఎరువులను కొనుగోలు చేసి రైతులకు విక్రయించాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.